సాక్షి
నల్లగొండ
సోమవారం । 22 । ఏప్రిల్ । 2024



**కాంగ్రెస్‌కు ఓటు వేయొద్దు**
లోక్‌సభ ఎన్నికల్లో మాదిగ బిడ్డలెవరూ కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకు ఓటు వేయొద్దని మంద కృష్ణమాదిగ అన్నారు. - 8లో



**స్తంభించిన ట్రాఫిక్**
భువనగిరిలో ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి రోడ్ షో సందర్భంగా ట్రాఫిక్ స్తంభించి వాహనదారులు ఇబ్బంది పడ్డారు. - 8లో

గరిష్టం / కనిష్టం
41° / 25°
**వాతావరణం**
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### హనుమాన్ శోభాయాత్ర శాంతియుతంగా చేపట్టాలి

- ఎస్పీ చందనా దీప్తి

**నల్లగొండ క్రైం:** ఈనెల 23న హనుమాన్ జయంతి సందర్భంగా జిల్లాలో వివిధ చోట్ల చేపట్టే శోభాయాత్రను ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా పోలీసుల సూచనలు పాటిస్తూ శాంతియుతంగా నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ చందనా దీప్తి ఒక ప్రకటనలో సూచించారు. శోభాయాత్ర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని ఆమె పేర్కొన్నారు.

### ప్రశాంతంగా టీఎస్ ఆర్‌జేసీ ప్రవేశ పరీక్ష

**నల్లగొండ:** నల్లగొండలోని 38కేంద్రాల్లో ఆదివారం టీఎస్ ఆర్‌జేసీ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ప్రభుత్వ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం జరిగిన ఈ పరీక్ష ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కొనసాగింది. పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 7,405 మంది విద్యార్థులు హాజరయ్యారని డీఈఓ భిక్షపతి తెలిపారు.

### నేడు బీజేపీ అభ్యర్థి సైదిరెడ్డి నామినేషన్



మాట్లాడుతున్న చాడ శ్రీనివాసరెడ్డి

**నల్లగొండ టూటౌన్:** బీజేపీ నల్లగొండ ఎంపీ అభ్యర్థిగా శానంపూడి సైదిరెడ్డి సోమవారం నామినేషన్ వేయనున్నట్లు ఆ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ ప్రబారి చాడ శ్రీనివాసరెడ్డి, జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి తెలిపారు. ఆదివారం నల్లగొండలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి హాజరవుతారని తెలిపారు. ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి మాట్లాడుతూ నల్లగొండలో కాషాయం జెండా ఎగుర వేసేందుకు ప్రతి కార్యకర్త సైనికునిలా పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో మాదగోని శ్రీనివాసగౌడ్, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, బండారు ప్రసాద్, పోతేపాక సాంబయ్య, పిల్లి రామరాజుయాదవ్, పోతెపాక లింగస్వామి, మిర్యాల వెంకటేశం తదితరులుపాల్గొన్నారు.

### జడ్జిలకు స్థానచలనం

**రామగిరి(నల్లగొండ):** జిల్లా కోర్టుల్లో న్యాయమూర్తులుగా పనిచేస్తున్న ఇద్దరు న్యాయమూర్తులకు స్థాన చలనం కలిగిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా మొదటి అదనపు జడ్జిగా పనిచేస్తున్న బి.తిరుపతిని మల్కాజిగిరి జిల్లా మూడో అదనపు జడ్జిగా బదిలీ చేసింది. ఆయన స్థానంలో నల్లగొండలోనే పనిచేస్తున్న జిల్లా రెండో అదనపు జడ్జి సంపూర్ణ ఆనంద్‌ను జిల్లా మొదటి అదనపు జడ్జిగా నియమించారు. ఆనంద్ స్థానంలో హైదరాబాద్ కుటుంబ న్యాయస్థాన న్యాయమూర్తిగా పనిచేస్తున్న ఎస్.రోజారమణిని అక్కడి నుంచి జిల్లా రెండో అదనపు జడ్జి కం ఎస్సీ ఎస్టీ కేసుల విచారణ న్యాయస్థాన న్యాయమూర్తిగా బదిలీ చేశారు. బదిలీ అయిన జడ్జిలు మే 1లోపు బాధ్యతలు స్వీకరించాలని హైకోర్టు ఆదేశించింది.

### ఎమర్జెన్సీ మోటార్ల ట్రయల్ రన్ పూర్తి

**పెద్దఅడిశర్లపల్లి:** జంట నగరాలకు తాగునీరందించేందుకు జలమండలి ఆధ్వర్యంలో రూ.3 కోట్ల వ్యయంతో నాలుగు రోజులుగా చేపడుతున్న పది ఎమర్జెన్సీ మోటార్ల ట్రయల్ రన్‌ను హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులు ఆదివారం పూర్తి చేశారు. ఈనెల 18న 60 క్యూసెక్కుల సామర్థ్యమున్న నాలుగు మోటార్లకు, 120 క్యూసెక్కుల సామర్థ్యమున్న రెండు మోటార్ల ట్రయల్ రన్ ట్రయల్ రన్ నిర్వహించారు. 19న 120 క్యూసెక్కుల సామర్థ్యమున్న మరో మోటార్‌తోపాటు 20న 60 క్యూసెక్కుల సామర్థ్యమున్న రెండు మోటార్లకు ట్రయల్ రన్ నిర్వహించారు. ఆదివారం మిగిలిన 120 క్యూసెక్కుల సామర్థ్యమున్న మరో మోటార్ నిర్వహించి ట్రయల్ రన్‌ను పూర్తి చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎండబ్ల్యూఎస్ డీఈ వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ మొత్తం పది మోటార్ల ద్వారా 900 క్యూసెక్కుల నీటిని సాగర్ వెనుక జలాల నుంచి అప్రోచ్ కెనాల్ ద్వారా పుట్టంగండి మోటార్లకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. జంట నగరాలకు మాత్రం నిరంతరాయంగా రోజు 525 క్యూసెక్కుల నీటిని సరఫరా చేయనున్నట్లు చెప్పారు.



అప్రోచ్ కెనాల్‌కు వదులుతున్న నీరు

# అభివృద్ధి బాధ్యత నాది

## భువనగిరిలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించండి : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపు

- ఉమ్మడి నల్లగొండ జిల్లాను కేసీఆర్ పట్టించుకోలేదు
- బీఆర్‌ఎస్ హయాంలో సాగునీటి ప్రాజెక్టులు నిర్వీర్యం
- ఎస్ఎల్‌బీసీని పూర్తి చేస్తే 3 లక్షల ఎకరాలు సాగయ్యేవి
- ఎన్నికల తర్వాత యాదగిరిగుట్టలో అభివృద్ధి పనులు
- భువనగిరిలో సీఎం రోడ్‌షో, కార్నర్ మీటింగ్

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

**సాక్షి, యాదాద్రి, భువనగిరిటౌన్ :** పదేళ్ల అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయలేకపోయిందని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. బ్రాహ్మణ వెల్లంల, ఎస్ఎల్‌బీసీ, డిండి, పాలమూరు ఎత్తిపోతల పథకాలను నీరుగార్చారని అన్నారు. 30 కిలో మీటర్ల కాలువ తవ్వితే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 3 లక్షల ఎకరాలకు సాగునీరు వచ్చేదన్నారు. భువనగిరి లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆదివారం రాత్రి భువనగిరిలో సీఎం రేవంత్‌రెడ్డి రోడ్‌షో, కార్నర్ మీటింగ్ నిర్వహించారు. స్థానిక వినాయక చౌరస్తాలో జరిగిన కార్నర్ మీటింగ్ సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. మూసీ ప్రక్షాళనను రూ.50 వేల కోట్లతో తమ ప్రభుత్వం చేపడుతుందన్నారు. ఉమ్మడి నల్లగొండ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని అన్నారు. యాదాద్రి పేరును యాదగిరిగుట్టగా మారుస్తామని ఆయన చెప్పారు. ఎన్నికల తర్వాత యాదగిరిగుట్టకు వచ్చి అక్కడే కూర్చొని భక్తులకు కావాల్సిన వసతులు, అభివృద్ధి పనులను చేపడుతామన్నారు. చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపిస్తే భువనగిరి అభివృద్ధికి కేంద్రం నుంచి నిధులు తెస్తాడని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తమను గెలిపించిన విధంగానే చామలను గెలిపించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు. ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ.. భువనగిరిలో కాంగ్రెస్‌ను గెలిపించి సీఎం రేవంత్‌రెడ్డికి బహుమతిగా ఇవ్వాలని కోరారు.

**బీఆర్‌ఎస్ పార్టీ లేచేదే లేదు..**

మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో చతికిలపడిన బీఆర్‌ఎస్ పార్టీ.. లేచేది లేదని, ఇప్పుడు రాష్ట్రంలో ఉన్న ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ ఒక్కటేనని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మా సోదరులం చెరో భుజంగా ఉన్నామని అన్నారు. రేవంత్ రెడ్డికి కోమటిరెడ్డి సోదరులు తోడైతే ఎవరూ తట్టుకోలేరని అన్నారు. బీఆర్‌ఎస్ లో అప్పుల పాలైన తెలంగాణను తిరిగి గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. భువనగిరిలో చామల కిరణ్ కుమార్‌రెడ్డిని గెలిపించే బాధ్యత తనదే అని రాజగోపాల్‌రెడ్డి ప్రకటించారు. అభివృద్ధి బాధ్యత సీఎం చూసుకుంటారని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో చెప్పినట్లుగా 12లో 11 స్థానాలు గెలుచుకున్నామని, సూర్యాపేట సీటు కొంచెంలో మిస్ అయిందని అన్నారు. ఈ ఎన్నికల్లో నల్లగొండ, భువనగిరి స్థానాల్లో కాంగ్రెస్‌కు అత్యధిక మెజార్టీ రాబోతోందని ఆయన చెప్పారు.



భువనగిరిలో జరిగిన కాంగ్రెస్ కార్నర్ మీటింగ్‌లో అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రాజగోపాల్‌రెడ్డి, ఐలయ్య, సామేల్, వీరేశం, అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డి



రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం

### కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు

కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తను కాంగ్రెస్ పార్టీ గుర్తిస్తుందని కాంగ్రెస్ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. 20 సంవత్సరాలు పాటు ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్, సామాన్య కార్యాకర్తగా పనిచేసిన తనకు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇచ్చిందన్నారు. సామాన్య కుటుంబ నుంచి వచ్చిన తనను ప్రజలు ఆశీర్వదించాలని ఆయన ప్రజలకు కోరారు.

**భువనగిరిలో కాంగ్రెస్‌కే మద్దతు : సీపీఐ**

భువనగిరి పార్లమెంట్‌కు సీపీఐ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ సీపీఎంకు ఎట్టిపరిస్థితిలోనూ మద్దతు ఇచ్చేది లేదని, ఇండియా కుటమి ఒప్పందం ప్రకారం కాంగ్రెస్‌కే మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. భువనగిరితో పాటు రాష్ట్రంలోని అన్ని లోక్‌సభ నియోజకవర్గాల్లో సీపీఐ ఎన్నికల ప్రచారంలో పాల్గొటుందని చెప్పారు.

**భువనగిరికి నిధులు కేటాయించాలి**

భువనగిరి నియోజకవర్గానికి పెండింగ్ ఉన్న పనులు పూర్తి చేసేందుకు నిధులు కేటాయించాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సీఎంను కోరారు. బునాదిగాని కాల్వ, పిలాయిపల్లి కాలువ, ధర్మరెడ్డి కాలువలకు నిధుల కేటాయింపుతో పాటు మూసీ పక్షాళన చేయాలన్నారు. దీంతో పాటు రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చే విధంగా చూడాలన్నారు. భువనగిరి నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ కారిడార్, ఐటీ కారిడార్ ఏర్పాటు చేసి ఇక్కడి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు.

**తుంగతుర్తికి నిధులు ఇవ్వాలి**

గత పాలకుల నిర్లక్ష్యం వల్ల తుంగతుర్తి నియోజకవర్గం వెనుకబాటుకు గురైందని, అభివృద్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యే మందుల సామేలు కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో తుంగతుర్తి నియోజకవర్గం నుంచి అత్యధిక మెజార్టీ ఇచ్చే బాధ్యత తీసుకుంటామని,గెలిచిన వెంటనే మాప్రాంతం అభివృద్ధి చేయాలన్నారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ.. కోమటిరెడ్డి సోదరులు ఉన్నంతవరకు నల్లగొండలో కాంగ్రెస్ పార్టీని ఎదుర్కొనే దమ్ము ఏ పార్టీకి లేదని అన్నారు.



భువనగిరిలో నిర్వహించిన కాంగ్రెస్ కార్నర్ మీటింగ్‌కు హాజరైన పార్టీ శ్రేణులు

# నాలుగు రోజులు జోరే..

- సోమవారం నుంచి హోరెత్తనున్న నామినేషన్ల పర్వం
- నామినేషన్లు దాఖలు చేయనున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు
- సభలు, ర్యాలీలకు సన్నాహాలు
- 25న ముగియనున్న నామినేషన్ల గడువు



భువనగిరిలో నామినేషన్ వేస్తున్న బహుజన ముక్తి పార్టీ అభ్యర్థి పెంట రమేష్ (ఫైల్)

**సాక్షి ప్రతినిధి, నల్లగొండ:** లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల గడువు దగ్గర పడుతోంది. ఉమ్మడి జిల్లాలోని రెండు లోక్‌సభ స్థానాల్లో ప్రధాన పార్టీ అభ్యర్థులు వరుసగా ఈ మూడు రోజుల పాటు నామినేషన్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. నామినేషన్ల దాఖలు ఈ నెల 25వ తేదీతో ముగియనుంది. నల్లగొండ, భువనగిరి లోక్‌సభ స్థానాలకు ఇప్పటి వరకు ప్రధాన పార్టీల వారు నామినేషన్లు పెద్దగా దాఖలు చేయలేదు. ప్రధాన పార్టీల నుంచి ఒకరిద్దరే నామినేషన్లు వేయగా, స్వతంత్ర అభ్యర్థులే ఎక్కువ మంది నామినేషన్లు అందజేశారు. ఇక సోమవారం నుంచి వరుసగా మూడు రోజుల పాటు ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు రెడీ అవుతున్నారు.

**నల్లగొండ లోక్‌సభ స్థానానికి..**

నల్లగొండ లోక్‌సభ స్థానానికి సంబంధించి గడిచిన మూడు రోజుల్లో 15 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. అందులో స్వతంత్రులు అధికంగా ఉన్నారు. ధర్మ సమాజ్ పార్టీతో పాటు ఇతర పార్టీ అభ్యర్థులు నామినేషన్లు వేశారు. ప్రధాన పార్టీ అయిన బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి తరఫున పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్ నామినేషన్ వేశారు. అందులో అఫిడవిట్ దాఖలు చేయలేదు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నుంచి ఎవరూ నామినేషన్ వేయలేదు.

**నేడు బీజేపీ అభ్యర్థి నామినేషన్**

బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి సోమవారం స్వయంగా నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి కిరణ్ రిజీజ్‌తో పాటు కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి పాల్గొననున్నారు. హైదరాబాద్ రోడ్డులోని లక్ష్మీ గార్డెన్ నుంచి గడియారం మీదుగా డీఈఓ కార్యాలయం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించనున్నారు. అక్కడ ప్రజలనుద్దేశించి మాట్లాడతారు. ముందుగా నామినేషన్ వేసిన తరువాత ఈ ర్యాలీ నిర్వహించనున్నారు.

### 24న రఘువీర్‌రెడ్డి నామినేషన్

నల్లగొండ కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి ఈనెల 24న నామినేషన్ వేయనున్నారు. ఉదయం 10 గంటలకు నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయం నుంచి భారీ ర్యాలీగా బయల్దేరి నామినేషన్ సమర్పిస్తారు. 12 గంటలకు గడియారం సెంటర్ భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ నామినేషన్, బహిరంగ సభలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి పాల్గొననున్నారు.

**23న బీఆర్‌ఎస్ అభ్యర్థి..**

నల్లగొండ బీఆర్‌ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి ఈ నెల 23న నామినేషన్ వేయనున్నారు. పట్టణంలో ర్యాలీ, సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి పాల్గొననున్నారు.

**భువనగిరి స్థానంలో..**

భువనగిరి లోక్‌సభ స్థానానికి సంబంధించి బీజేపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ ఈ నెల 18న అధికారికంగా నామినేషన్ వేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్ రెడ్డి ఈ నెల 22న లేదంటే 24వ తేదీన నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ భువనగిరిలో రోడ్ షో, కార్నర్ మీటింగ్ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి క్యామ మల్లేష్ సోమవారం నామినేషన్‌ను దాఖలు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి పాల్గొననున్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలి

- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి



రోడ్‌షోలో మాట్లాడుతున్న జగదీష్‌రెడ్డి

**గుర్రంపోడు:** ఒక్కతడి నీరివ్వలేక వరి పంటలను ఎండబెట్టిన అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈ లోక్‌సభ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం గుర్రంపోడు మండలకేంద్రంలో బీఆర్‌ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించాలని కోరుతూ నిర్వహించి రోడ్ షోలో ఆయన మాట్లాడారు. సాగర్‌లో నీళ్లున్నా.. రెండున్నర లక్షల ఎకరాల పంటలు ఎండిపోయాయని, గతంలో ఇలాంటి పరిస్థితి వచ్చినా కేసీఆర్ కాల్వలకు నీరిచ్చి పంటలను కాపాడారని గుర్తు చేశారు. కేసీఆర్ ఉంటే నీళ్లు, కాంగ్రెస్ వస్తే కన్నీళ్లు వస్తాయని రైతులకు తెలిసిందన్నారు. రూ.4వేల పింఛన్ ఇస్తామని, రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని, రూ.15వేల రైతుబంధు అంటూ ఇలా ఎన్నో రకాల హామీలు ఇచ్చి విస్మరించిందన్నారు. రైతులకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి వడ్లు కొనే దిక్కులేదన్నారు. కాంగ్రెస్ నాయకులు కాంట్రాక్టర్లు, రైస్ మిల్లర్లను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో కంచర్ల కృష్ణారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి మాట్లాడుతూ తనను గెలిపించి లోక్‌సభకు పంపితే రైతుల పక్షాన కొట్లాడతానన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నోముల భగత్‌కుమార్, కంచర్ల భూపాల్‌రెడ్డి, విజయసింహారెడ్డి, జెడ్పీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్, మందడి సైదిరెడ్డి, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వజ్జ రామేశ్వరీధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

### ప్రకటనల ప్రచారానికి అనుమతి తప్పనిసరి

**నల్లగొండ:** లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు రాజకీయ ప్రకటనల ప్రచారం కోసం మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన ఒక ప్రకటనలో తెలిపారు. సోషల్ మీడియా (వాట్సాప్, ట్విట్టర్, ఫేస్ బుక్, ఇన్‌స్టాగామ్)తోపాటు, ఎలక్ట్రానిక్ మీడియా, స్థానిక కేబుల్ చానల్స్, ఎఫ్ఎం రేడియో, సినిమా థియేటర్లలో న్యూస్ రీల్స్, కరపత్రాల ముద్రణ వంటి వాటి కోసం 24 గంటల ముందుగానే ఎంసీఎంసీకి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఎన్నికల ప్రచార కరపత్రాలలో తప్పనిసరిగా ప్రచురణకర్త పేరు, చిరునామా, ప్రింటర్ పేరు ఉండాలని తెలిపారు. కరపత్రాలు ఎవరికి వ్యతిరేకంగా ఉండకూడదని, ఏదైనా కులం, మతానికి అనుకూలంగా కానీ, కోర్టు కేసు అంశాలు లేకుండా 1951 ప్రజాప్రాతినిధ్య చట్టంలోని 127–ఎ నియమ నిబంధనలను పాటిస్తూ ప్రచురించాలని తెలిపారు.

# రఘువీర్‌రెడ్డి నామినేషన్‌కు తరలిరావాలి



సమావేశంలో మాట్లాడుతున్న గుమ్ముల మోహన్‌రెడ్డి, చిత్రంలో మున్సిపల్ చైర్మన్ తదితరులు

- గుమ్ముల మోహన్‌రెడ్డి, బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

**నల్లగొండ:** ఈనెల 24న నల్లగొండ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి కార్యకర్తలు భారీ ఎత్తున తరలి రావాలని ఆ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం నల్లగొండలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. నామినేషన్ అనంతరం మధ్యాహ్నం 12 గంటల తర్వాత గడియారం సెంటర్‌లో భారీ బహిరంగ సభ ఉంటుందన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, మాజీ చైర్మన్ బొడ్డుపల్లి లక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, నాయకులు గడ్డం అనూప్‌రెడ్డి, శ్రీని వాసగౌడ్, పాశం సంపత్‌రెడ్డి, ఎం.నవీన్‌కుమార్‌గౌడ్, కె.వేణుగోపాల్‌రెడ్డి, బషీర్, శ్రీను, ఆలకుంట్ల మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్యం.. 82 లక్షల పనిదినాలు

- ఈ ఏడాదికి ఉపాధి కూలీలకు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయం
- లేబర్ బడ్జెట్ కూడా విడుదల
- గ్రామసభల ద్వారా గుర్తించనున్న పనులు
- మండలాల వారీగా కేటాయించిన అధికార యంత్రాంగం



మాడ్గులపల్లిలో ఉపాధి పనులకు హాజరైన కూలీలు

**దేవరకొండ:** గ్రామీణ ప్రాంతాల్లో వలసలను నివారించి కూలీలకు ఉపాధి పనులు కల్పించడానికి ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందులో భాగంగా 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లా వ్యాప్తంగా 82,04,213 పని దినాలు లక్ష్యంగా నిర్దేశించింది. ఈ మేరకు పనుల లేబర్ బడ్జెట్‌ను విడుదల చేసింది. ఇప్పటికే గ్రామాల్లో అధికారులు సభలు నిర్వహించి చేపట్టాల్సిన పనులను గుర్తిస్తున్నారు. అడిగిన ప్రతి కూలీకి పని కల్పించేలా కార్యాచరణ సిద్ధం చేశారు.

**3.56లక్షల జాబ్ కార్డులు**

జిల్లా వ్యాప్తంగా 31 మండలాల్లో మొత్తం 3,56,876 జాబ్ కార్డులు ఉన్నాయి. ఇందులో 7,63,917 మంది కూలీలు నమోదై ఉన్నారు. ఇందులో 2,25,887జాబ్ కార్డులు యాక్టివ్‌గా ఉండగా..3,97,432 మంది కూలీలు పనులకు వెళ్తున్నారు. 2023–24 సంవత్సరానికి గాను జిల్లాకు 85,91,702 పని దినాలు కేటాయించగా ఇప్పటి వరకు 77,29,122 పని దినాలను పూర్తి చేశారు. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి మండలాల వారీగా ఇప్పటికే అధికార యంత్రాంగం పనిదినాలను కేటాయించింది.

**మండలాల వారీగా లక్ష్యం**

| మండలం | పనిదినాలు | మండలం | పనిదినాలు | మండలం | పనిదినాలు |
|---|---|---|---|---|---|
| అడవిదేవులపల్లి | 1,46,192 | గుర్రంపోడు | 2,31,100 | నాంపల్లి | 2,39,593 |
| అనుముల | 1,79,082 | కనగల్ | 2,98,561 | నార్కట్‌పల్లి | 1,95,187 |
| చందంపేట | 2,46,120 | కట్టంగూర్ | 2,21,670 | నేరెడుగొమ్ము | 1,69,530 |
| చండూరు | 1,75,795 | కేతేపల్లి | 2,60,670 | నిడమనూరు | 3,22,250 |
| చింతపల్లి | 3,27,125 | కొండమల్లేపల్లి | 2,56,849 | పీఏపల్లి | 3,99,086 |
| చిట్యాల | 1,59,034 | మాడ్గులపల్లి | 2,47,506 | పెద్దవూర | 2,68,474 |
| దామరచర్ల | 3,11,555 | మర్రిగూడ | 4,24,300 | శాలిగౌరారం | 2,54,883 |
| దేవరకొండ | 3,81,400 | మిర్యాలగూడ | 4,18,030 | తిప్పర్తి | 2,14,441 |
| గుండ్లపల్లి | 3,08,006 | మునుగోడు | 2,59,063 | త్రిపురారం | 3,38,926 |
| | | నకిరేకల్ | 2,34,752 | తిరుమలగిరిసాగర్ | 3,05,340 |
| | | నల్లగొండ | 2,45,970 | వేములపల్లి | 1,63,723 |

**చేపట్టనున్న పనులు ఇలా..**

ఉపాధిహామీ పథకంలో భాగంగా ప్రతి కూలీకి పని కల్పించే ఉద్దేశంతో అధికారులు పక్కా ప్రణాళికలు రూపొందించారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామసభలు నిర్వహించి గ్రామస్తులు, కూలీలు, మహిళా సంఘాల సభ్యులతో కలిసి పనులను గుర్తిస్తారు. గ్రామాల్లో మట్టి రోడ్లు వేయడం ,చెరువుల్లో పూడికతీత, అవసరమైన రైతుల పొలాలకు చెరువు మట్టి తరలింపు, నీటి నిల్వ కోసం కట్టలు, కాల్వలు తవ్వడం, కందకాల ఏర్పాటు వంటి పనులు చేపడతారు. ఉపాధిహామీ అత్యవసర పనులతో పాటు రైతులు, గ్రామస్తులకు అవసరమైన పనులకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు.

### ప్రతి కూలీకి పని కల్పిస్తాం



ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా జిల్లాలో ప్రతి ఒక్క ఉపాధి కూలీకి పని కల్పిస్తాం. ఈ ఏడాది జిల్లాకు కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించేలా ఇప్పటికే ప్రణాళికలు రూపొందించాం. అడిగిన ప్రతి కూలీకి పని కల్పించే విధంగా చర్యలు తీసుకుంటాం.

– టి.నాగిరెడ్డి, డీఆర్‌డీఓ, నల్లగొండ

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

## రేవంత్ రెడ్డి రోడ్ షో..


భువనగిరి రోడ్ షోలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రాజగోపాల్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, అయిలయ్య, ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డి


గీత కార్మికుడితో మాట్లాడిస్తున్న రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


భువనగిరి పట్టణంలో సాగుతున్న రోడ్ షో


పాటలు పాడుతున్న ఏపూరి సోమన్న తదితరులు

## స్తంభించిన ట్రాఫిక్


బస్టాండ్‌లో పార్కింగ్ చేసిన వాహనాలు

**భువనగిరి క్రైం:** భువనగిరి పట్టణంలో ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రోడ్ షో సందర్భంగా ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు మధ్యాహ్నం 2గంటల నుంచే బస్సులను భువనగిరి పట్టణం లోపలికి రాకుండా బైపాస్ నుంచే మళ్లించారు. అదేవిధంగా రోడ్ షోకు వచ్చిన వారు తమ కార్లు, ఇతర ప్రైవేట్ వాహనాలను బస్టాండ్‌లో పార్కింగ్ చేశారు. అటు నల్లగొండ నుంచి వచ్చిన వాహనాలను బైపాస్ వద్దనే పోలీసులు నిలిపివేశారు. నల్లగొండకు వెళ్లాల్సిన ప్రయాణికులు ఆటోల ద్వారా బైపాస్‌కు వెళ్లడానికి ఇబ్బందులు పడ్డారు. హైదరాబాద్–వరంగల్ వెళ్లే ప్రయాణికులు బస్టాండ్‌లో వేచి చూసి బైపాస్‌కు వెళ్లగా.. అక్కడ బస్సులు ఆపకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

**భారీ బందోబస్తు ఏర్పాటు..**

సీఎం రోడ్ షో సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఆర్‌పీఎఫ్ బలగాలను మోహరించారు. భువనగిరి డీసీపీ రాజేష్ చంద్ర ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఏసీపీ రవికిరణ్‌రెడ్డి, చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, అడిషనల్ డీసీపీ పి. రమేష్‌కుమార్, ఏసీపీ కొండల్‌రావు, సీఐ ప్రభాకర్‌రెడ్డి, సురేష్ కుమార్, ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది బందోబస్తులో పాల్గొన్నారు.


బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

# కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు ఓటు వేయొద్దు

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

**చౌటుప్పల్:** లోక్‌సభ ఎన్నికల్లో మాదిగ జాతి బిడ్డలు ఎవరూ కూడా కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకు ఓటు వేయొద్దని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపునిచ్చారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామంలో ఆదివారం రాత్రి ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు మంద కృష్ణమాదిగా ముఖ్య అతిథిగా హాజరై గత 30 ఏళ్లుగా వర్గీకరణ ఉద్యమంలో చోటుచేసుకున్న ఘటనలను కార్యకర్తలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ కోసం మూడు దశాబ్దాలుగా పోరాడుతున్నానని తెలిపారు. పార్టీల జెండాలు మారిస్తే ఎన్నో ఉన్నతమైన పదవులు తన దగ్గరకు వచ్చేవన్నారు. కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో 2004–14 మధ్య కాలంలో అధికారంలో ఉండగా ఎస్సీ వర్గీకరణ చేయలేదని ధ్వజమెత్తారు. కనీసం ఈ పదేళ్లలో వర్గీకరణ కోసం కేంద్ర ప్రభుత్వానికి రాహుల్‌గాంధీ ఉత్తరం కూడా రాయలేదన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకి అని అన్నారు. రాష్ట్రంలో పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ మాదిగలను అణచివేసే చర్యలకు పూనుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాదిగలకు ఎవరూ చేయని నష్టం కేసీఆర్ చేశారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన పదవిని కాపాడుకునేందుకు మాలలతో కుమ్మక్కయ్యాడని ఆరోపించారు. 3 లోక్‌సభ సీట్లలో కాంగ్రెస్ పార్టీ మాదిగలకు కనీసం ప్రాతినిధ్యం లేకుండా వ్యవహరించిదన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో మాదిగలు బీజేపీకే ఓటు వేయాలని సూచించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ లింగస్వామి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ దూడల భిక్షంగౌడ్, మున్సిపాలిటీ, మండల అధ్యక్షులు కంచర్ల గోవర్ధన్‌రెడ్డి, చినుకని మల్లేష్, ఎంపీటీసీ సభ్యురాలు బోయ ఇందిరాసంజీవ, నాయకులు ఉబ్బు భిక్షపతి, కట్ట కృష్ణ, కడారి అయిలయ్య, ఊదరి రంగయ్య, ఎర్ర గణేష్, పబ్బు వంశీ, బుడ్డ సురేష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

## కదం తొక్కిన కాంగ్రెస్

**భువనగిరిటౌన్:** కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కదం తొక్కాయి. ఆదివారం భువనగిరిలో నిర్వహించిన భారీ రోడ్ షోకు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిచ్చారు. సాయంత్రం 4గంటలకు సభ ప్రారంభంకావాల్సి ఉండగా రెండున్నర గంటలు ఆలస్యమైనా కార్యకర్తల్లో నిరుత్సాహం కనిపించలేదు. సీఎం రేవంత్‌రెడ్డి సాయంత్రం 6.45గంటలకు రోడ్డు మార్గం ద్వారా వచ్చి పెద్ద చెరువు నుంచి రోడ్ షో చేస్తూ హైదరాబాద్ చౌరస్తా, జగదేవ్‌పూర్ చౌరస్తా, రైతు బజార్ మీదుగా వినాయక చౌరస్తా వరకు చేరుకుని కార్నర్ మీటింగ్‌లో ప్రసంగించారు. భువనగిరికి ఉన్న చరిత్రను ఆయన గుర్తుచేశారు. సభ అనంతరం సాయిబాబా గుడి వరకు రోడ్‌షో నిర్వహిస్తూ ప్రజలకు అభివాదం చేస్తూ వెళ్లారు. సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన కాంగ్రెస్ కార్యకర్తల్లో జోష్ నింపింది.


నృత్యాలు చేస్తున్న కళాకారులు

సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా భువనగిరి రావడంతో ఆ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సభలో నల్లగొండ గద్దర్ పాటలు పాడగా.. కార్యకర్తలు డ్యాన్స్ చేశారు. ర్యాలీలో డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, కుంభం కీర్తి రెడ్డి, తంగెళ్లపల్లి రవికుమార్, సామ మధుసూదన్‌రెడ్డి, బర్రె జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్ ఒక్క స్థానం కూడా గెలవదు

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి


మునుగోడు ఎంపీపీ స్వామికి కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

**మునుగోడు:** లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్రంలో ఒక్క స్థానం కూడా గెలవదని, 14 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన మునుగోడు ఎంపీపీ కర్నాటి స్వామితో పాటు ఆ పార్టీకి చెందిన జిల్లా, మండల, గ్రామస్థాయి నాయకులు దాదాపు 500కు పైగా మంది మునుగోడులోని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అందిస్తున్న ప్రజా పాలనని చూసి ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరేందుకు ముందుకు వస్తున్నారన్నారు. రానున్న రోజులల్లో ఏ ఒక్కరు కూడా బీఆర్‌ఎస్ పార్టీలో కొనసాగరని, ప్రతిఒక్కరు కాంగ్రెస్‌లోనే చేరుతారన్నారు. అంతేకాకుండా త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులపై పోటీ చేసేందుకు ఏ ఒక్కరూ ముందకురారన్నారు. పార్టీలో చేరిన వారిలో పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్న కైలాస్ నేత, డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు నారబోయిన రవి, భీమనపల్లి సైదులు తదితరులు పాల్గొన్నారు.

# ఆశీర్వదించండి.. అండగా ఉంటా

- నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి చొల్లేటి ప్రభాకర్

**హాలియా:** తనను ప్రజలు ఆశీర్వదించి నల్లగొండ ఎంపీగా గెలిపిస్తే అందరికీ అండగా ఉంటానని స్వతంత్ర అభ్యర్థి, రిటైర్డ్ ఐఏఎస్ చొల్లేటి ప్రభాకర్ అన్నారు. ఆదివారం హాలియా పట్టణంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. నల్లగొండ లోక్‌సభ నియోజవర్గంలో అట్టడుగు వర్గాలు, వెనుకబడిన వర్గాల ప్రజల ఓట్లు ఎక్కువగా ఉన్నప్పటికీ 1952 నుంచి ఇప్పటి వరకు ఉన్నత వర్గాలకు ఓట్లు వేసి గెలిపించారని, ఈ ఒక్కసారి తనను గెలిపిస్తే ప్రజా గొంతుకనై ప్రశ్నిస్తానన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాజ్యాంగం ప్రజలకు ఓటు హక్కు కల్పించిందని, దానిని డబ్బు, మద్యానికి, అమ్ముకోకుండా మంచి నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో కొంతమంది వ్యక్తుల చేతిలో ప్రజాస్వామ్యం బందీ అయ్యిందని విమర్శించారు. యువత, ఉద్యోగులు, నిరుద్యోగులు, మహిళలు ఆలోచించి మంచి నాయకుడికి ఓటు వేసి గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.


హాలియాలో ప్రచారం చేస్తున్న చొల్లేటి ప్రభాకర్

- కలిసి సాగుదాం..


హుజూర్‌నగర్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో అభివాదం చేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, నల్లగొండ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి, చిత్రంలో మాజీ మంత్రి జానారెడ్డి, ఎమ్మెల్యేలు, నాయకులు


ఎన్నికల ప్రచార సభకు హాజరైన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

- అమ్మా.. నన్ను యాదుంచుకో


భూదాన్‌పోచంపల్లి: కనుముకుల గ్రామంలో ఓటు అభ్యర్థిస్తున్న సీపీఎం భువనగిరి ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్

## కుక్క దాడి.. ముగ్గురికి గాయాలు

**గుర్రంపోడు:** మండలంలోని మొసంగి గ్రామంలో ఆదివారం వీధి కుక్క దాడి చేయడంతో ముగ్గురు గాయపడ్డారు. గ్రామానికి చెందిన చల్లా లక్ష్మమ్మ ఇంట్లో మంచంపై నిద్రించగా.. ఆమె చేతిని కుక్క కరవడంతో తీవ్ర గాయమైంది. అదేవిధంగా నడ్డి భవాని, నడ్డి దీపికను కరిచింది. గేదెలను కూడా కరవడంతో గ్రామస్తులు భయాందోళనకు గురై కుక్కును వెంటాడి చంపేశారు.

# కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

**మిర్యాలగూడ టౌన్:** కుటుంబ కలహాలతో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శనివారం రాత్రి మిర్యాలగూడ మండలం బి. అన్నారం గ్రామ పంచాయతీ పరిధి గద్దగూడుతండాలో జరిగింది. మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ కె. నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గద్దగూడుతండాకు చెందిన ఇస్లావత్ బాలాజీ(30)కి భార్య సైదమ్మ, కుమార్తె, కుమారుడు ఉన్నారు. శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాలాజీ టవల్‌తో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చుట్టుపక్కల వారు గమనించి కుటుంబ సభ్యులతో పాటు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాగా శనివారం బాలాజీతో తన సడ్డకుడు కిరణ్ గొడవపడ్డాడని, గత కొంతకాలంగా బాలాజీకి, తన భార్య మధ్య గొడవలు జరుగుతున్నాయని కుటుంబ సభ్యులు పోలీసులకు తెలియజేశారు. భార్య సైదమ్మ, సడ్డకుడు కిరణ్, బావమరిది రాముడు వేధింపుల వల్లే తన కుమారుడు ఉరేసుకున్నాడని మృతుడి తల్లి ఇస్లావత్ చాందీ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## 'సెలవు ఇవ్వనందునే ఆత్మహత్యాయత్నం' నిజం కాదు

- ఆర్టీసీ ఆర్‌ఎం శ్రీదేవి

**నల్లగొండ క్రైం:** ఆర్టీసీ అధికారులు సెలవు ఇవ్వనందునే దేవరకొండ డిపోకు చెందిన డ్రైవర్ శంకర్ ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడన్న వార్త నిజం కాదని ఆర్టీసీ ఆర్‌ఎం శ్రీదేవి తెలిపారు. శంకర్ ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే ఈ నెల 18, 19 తేదీల్లో విధులకు రాలేదని అన్నారు. 20న అధికారులు శంకర్‌కు డ్యూటీని కేటాయించారన్నారు. అయితే శంకర్ ఆదివారం కూడా సెలవు కావాలని డిపో అధికారులను సంప్రదించగా.. లీవ్ పొజిషన్ చూసి సెలవు మంజూరు చేస్తామని చెప్పారన్నారు. శనివారం శంకర్ పురుగుల మందు తాగుతూ తీసుకున్న సెల్ఫీ వీడియో వాట్సాప్‌లో షేర్ చేయడంతో అతడిని డిపో అధికారులు దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారన్నారు. ప్రస్తుతం శంకర్ తన ఇంటి వద్ద సురక్షితంగా ఉన్నాడని ఆమె తెలిపారు. ఇలాంటి ఘటనలపై పూర్తిస్థాయిలో విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అన్నారు.

## విద్యార్థులకు అవగాహన సదస్సు

**రామగిరి(నల్లగొండ):** నల్లగొండలోని నాగార్జున డిగ్రీ కళాశాల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం నల్లగొండ రీజనల్ సెంటర్‌లో సెంటర్ కో ఆర్డినేటర్ డాక్టర్ అంతటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం పీజీ, డిగ్రీ విద్యార్థులకు అధ్యాపకుల పరిచయ కార్యక్రమం, అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సబ్జెక్టుపై అవగాహన, సబ్జెక్ట్‌ను ఇష్టంగా చదవడం వంటి అంశాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఇంగ్లిష్ అధ్యాపకులు మామిడి సతీష్ కుమార్, చింతమల సుధాకర్, గంగదరి నర్సింహ, తెలుగు అధ్యాపకులు పున్నా అంజయ్య, మామిడి లింగస్వామి, ప్రభుత్వ పాలన శాస్త్రం అధ్యాపకులు పెరిక మధు, కెమిస్ట్రీ అధ్యాపకులు, కత్తుల కిశోర్, కామర్స్ అధ్యాపకులు శంకరయ్య, చరిత్ర అధ్యాపకులు తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

## రైలు నుంచి జారిపడి యువకుడు మృతి

**మాడుగులపల్లి:** రైలు నుంచి జారిపడి యువకుడు మృతి చెందిన ఘటన మాడుగులపల్లిలోని అభంగాపురం శివారులో ఆదివారం జరిగింది. రైల్వే ఎస్‌ఐ సాలకమ్మ, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అస్సాం రాష్ట్రంలోని గోలాఘాట్ జిల్లాకు చెందిన కిరణ్ మిల్ తన కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి దిబ్రూగఢ్ ఎక్స్‌ప్రెస్ రైలులో సికింద్రాబాద్ బయల్దేరాడు. రైలు మాడుగులపల్లి మండలం అభంగాపురం శివారుకు రాగానే కిరణ్ మిల్ రైలు బోగి నుంచి జారి కిందపడడంతో ప్రాణాలు కోల్పోయాడు. కిరణ్ మిల్ బోగి నుంచి పడిపోవడాన్ని మరో వ్యక్తి గుర్తించి రైలును నిలిపేందుకు చైన్ లాగాడు. వెనుక నుంచే వచ్చే గూడ్స్ రైలు లోకో పైలెట్‌కు సమాచారం ఇవ్వడంతో అతడు మృతదేహాన్ని గుర్తించాడు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు రైల్వే ఎస్‌ఐ తెలిపారు.


## రమేష్‌రెడ్డికి ఇన్నోవేటివ్ అవార్డు


అవార్డు అందుకుంటున్న చైర్మన్ రమేష్‌రెడ్డి

**రామగిరి (నల్లగొండ):** నల్లగొండలోని గౌతం స్కూల్ చైర్మన్ రమేష్‌రెడ్డి ఇన్నోవేటివ్ లీడర్ షిప్ అవార్డు అందుకున్నారు. ఆదివారం జైపూర్‌లోని రాజస్తాన్‌లో నిర్వహించిన ఇన్నోవేటివ్ ఇండియన్ స్కూల్ అవార్డ్స్ కార్యక్రమంలో సవాయి బావనిసింగ్, ఇన్నోవేటివ్ అవార్డ్స్ ఫౌండర్ రాజీవ్‌మోడీలు రమేష్‌రెడ్డికి అవార్డు అందజేశారు. ఇన్నోవేటివ్ మెథడ్స్ ఇన్ టీచింగ్ పోటీల్లో నిర్వహించిన నామినేషన్‌లో రమేష్‌రెడ్డికి అధిక సంఖ్యలో విద్యా పండితుల మెజార్టీ లభించింది.

# సర్టిఫికెట్లలో వేర్వేరుగా పుట్టిన తేదీలు

- రిటైర్డ్ అయిన తర్వాత కూడా జాబ్ చేస్తున్నట్లు ఆరోపణ
- నారాయణపురం ప్రాథమిక సహకార సంఘం సీఈఓ వ్యవహారంపై డీసీఓకు ఫిర్యాదు
- విచారణకు ఆదేశం



చిలుకూరు జెడ్పీహెచ్‌ఎస్ జారీ చేసిన బోనఫైడ్ సర్టిఫికెట్‌లో 1960గా నమోదైన పుట్టిన తేదీ

**చిలుకూరు:** ఎప్పుడో పదవీ విరమణ పొందాల్సిన ఓ ఉద్యోగి సర్టిఫికెట్లలో వేర్వేరు పుట్టిన తేదీలతో ఇప్పటికీ ఉద్యోగం చేస్తూ వస్తున్నాడు. ఈ ఘటన చిలుకూరు మండల పరిధిలోని నారాయణపురం ప్రాథమిక సహకార సంఘంలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. చిలుకూరు మండలంలోని నారాయణపురం ప్రాథమిక సహకార సంఘం సీఈఓ సాకి వెంకటేశ్వర్లు(బాబు) 1997లో 7వ తరగతి అర్హతతో సహకార సంఘంలో క్లర్క్‌గా ఉద్యోగంలో చేరాడు. ఆ తర్వాత పదోన్నతుల కోసం అతడు హుజూర్‌నగర్ మండల పరిధిలోని కరక్కాయలగూడెం జెడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి పూర్తి చేశాడు. ఎప్పటికప్పుడు పదోన్నతుల కోసం ఉన్నత చదువులు చదువుకుంటూ వచ్చి ప్రస్తుతం సీఈఓ స్థాయికి వచ్చాడు. కాగా వెంకటేశ్వర్లు తప్పుడు పుట్టిన తేదీలతో ఉద్యోగంలో కొనసాగుతున్నట్లు గుర్తించిన సహకారం సంఘం డైరెక్టర్లు సమాచార హక్కు చట్టం ద్వారా అతడు చదివిన పాఠశాలల నుంచి బోనాఫైడ్ సర్టిఫికెట్, టెన్త్ క్లాస్ మెమో తెప్పించారు. అందులో అతడు పుట్టిన తేదీని 9 సంవత్సరాలు తప్పుగా నమోదు చేయించినట్లు బయటపడింది. వెంకటేశ్వర్లు 1974–75లో చిలుకూరు జిల్లా పరిషత్ పాఠశాలలో 7వ తరగతి పూర్తిచేయగా.. స్కూల్ రికార్డుల్లో అతడి పుట్టిన తేదీ 15–02–1960గా ఉంది. ఆ తర్వాత పదో తరగతి 1998–99లో పూర్తి చేసినట్లుగా సర్టిఫికెట్లు ఉన్నాయి. పదో తరగతి మెమోపై పుట్టిన తేదీ 15–02–1969గా ఉంది. దీంతో పూర్తి ఆధారాలతో పలువురు డైరెక్టర్లు జిల్లా సహకార అధికారికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఈఓపై విచారణకు ఆదేశించినట్లుగా తెలిసింది.

**డబ్బులు రికవరీ చేయాలి..**

సీఈఓ వెంకటేశ్వర్లు 2018లోనే పదవీ విరమణ పొందాల్సి ఉందని, కానీ నిబంధనలకు విరుద్ధంగా గత నాలుగేళ్లుగా ఇంకా ఉద్యోగంలో కొనసాగుతున్నాడని గ్రామస్తులు అంటున్నారు. అతడు నెలకు రూ.50 వేలు జీతం తీసుకుంటున్నాడని, ఈ లెక్కన గత నాలుగేళ్లుగా రూ.24 లక్షల జీతం అక్రమంగా తీసుకున్నాడని, ఆ డబ్బులు మొత్తం రికవరీ చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ చేసి తక్షణమే అతన్ని సంఘం సీఈఓగా తొలగించడంతో పాటు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## యాదాద్రిలో భక్తుల రద్దీ

**యాదగిరిగుట్ట:** యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వారాంతపు సెలవు రోజు కావడంతో జంట నగరాలతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అధికంగా శ్రీస్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చారు. దీంతో ఆలయ క్యూకాంప్లెక్స్, మాడ వీధులు, ప్రసాద విక్రయశాల, ముఖ మండపంలోని క్యూలైన్, నిత్య కల్యాణ మండపం, శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపం, లక్ష్మీ పుష్కరిణి, ఆర్టీసీ బస్టాండ్ వంటి ప్రాంతాల్లో భక్తులు అధికంగా కనిపించారు. ధర్మ దర్శనానికి మూడు గంటలు, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టిందని భక్తులు వెల్లడించారు. కాగా.. యాదాద్రీశుడిని 35వేల మందికి పైగా భక్తులు దర్శించుకున్నారని, వివిధ పూజలతో శ్రీస్వామి వారికి రూ.44,63,708 నిత్య ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.